# దోదమ్మి

పున్నమి మళ్ళిన, – మూడున్నొక్క పొద్దున, – తొలిజామున తలుకేసిన కెంపుచుక్క, – రిమరిమ, సున్నలోకెక్కి శూన్యంలోకి ప్రాకి, – కానరానంతమేర కమ్ముకునివున్న మొయిలుతుంపరలో, ఒక మినుకు వల్లమాలిన వెలుగైపోవంగా, – రవరవమంచులు చిమ్మి – ఊహాహాలు ధారలు కట్టి, – వీడుపాయలై వీకరాశిని, – పాలవెల్లిమీద తొణికిపోగా, – పరుచుకున్న ముత్తెపుచుక్కలు, ఓ వాసి కదిలి, – వెలుగని వేడికి తీగెసాగి, – చుక్కలదారిలో సుడితిరిగి, :– నీడలున్న మేరల్లో, చిగురేసి, – తళుకు వాగులో, – మారాకు వేసి, – బెళుకు వాగులో, – మొగ్గతొడిగి, – వీకమొయిని దారి, ఒంటిరేకవిచ్చి, – గాలితెరకంది, – మరింతవిచ్చుకుని, – మరో అలమీద, – పక్వానికొచ్చి – పాకానికొచ్చి – నివ్వరిముల్లంత వెన్నేసి, – అంత వెన్నులోనూ ఓ రెమ్మ, షైరలో మరగిపోకుండా, – నేలమీద, – కానరాక వాలంగా, –

కోనలో నాయకుడికి, – కంటిమీద మెరుపు మెరసి, ఒంటికి సత్తువొచ్చి, – ఒక్కగుక్క, కుశేలొచ్చి, – గురువింద పొదమీద పులుగు పోరెట్టగా, – పుట్టినబిడ్డ పోరెట్టగా, – ఆ చేత అందుకుని, – అమ్ముపిడిచినట్లు, – ఎగరేసి, – ఓ చేత అందుకుని, – ఔరకూనా, – సత్తువుంది, సంబరముంది, – గొంతులో బిగువుంది, – చూపులో పదునుంది: కోన ఏలుకునేవులే – అని, – ఓ కన్నెచేతి కెగురవేసి, – కోనదేవరా, వాకిలి పండంతపుట్టి, – తీయమామిడంత తేరుకోవాలి: పగవాడి కంటికి పనసముల్లు, కావాలి, – బైరుకున్న పడిచ్చి, – సింగం కోరుకున్న వాడిచ్చి, – నాగంత పరుగిచ్చి, – అలుగంత పదునిచ్చి, – ఆదుకోరా! – అని, మాట వేసారించి, – ఒంటిరక్కాస గుబురు మొదల, – ఓ చెయి విదిలించి, – మంచుకుమల్లె, కెంపుచుక్కలుబుకంగా, – చుక్కనేలరాలకముందే, – కూనకు నుదురద్ది – ఇదీ, – నీ వెన్ను కాపురా కూనా, – అని, అని, – మొయిలుదేవుడా, – నీవు చినికితే, ముత్తెం దొరికింది – నీ సత్తెం జూపరా, – అని కొండాడి – కనులుమూసి, – మూడుఅంగలేసి – ఒక కన్ను తెరిచి, మూడుపరుగులుతీసి, – రెండు చూపులుకలిపి, – మూడు ఉరుకు లురకంగా, – ధగధగమనే గరపవెంపలిమీద, – పచ్చని, కాడ – రంగుకో చిగురు – చిటారున కెంపంత పువ్వు, – అల్లంత చిటిమాను కానరాగా – యిదే సత్తెమని, – తోడుగా పెరిగేవని, – చికిలి చికిలింత మండలు తెచ్చి, మానుతేనె పాదుకట్టి, – కడిమిపూల నీరోసి గోగుపుప్పొడి చల్లి, – మూడు పొద్దులకు గుబురుకట్టించి, – గుబురిచ్చిన నీడలో కూనను సాకమనంగా, –

వెల్లమొయిలు వెలుగేయంగా, – కొండగోగు పూసినట్టు, – కొణిదెవ చిగురేసినట్టు, – ఇరులు నిటారోయినట్లు – పున్నమి పున్నమికీ, – ఒక్కపిడికిలి,

– ఒక్క అల్లైతాడు, – రెండు అలుగులు, – ఒక్క బరిసె, ఒక్క సెలగోల – అంత ఉవ్వెత్తుకువచ్చి, – కూన ఎదిగి, – కోనకు సిరొచ్చి, – ఏడు నిలువులు ఎదిగి, – చిటారుపూవుతోవున్న పచ్చమాను, – వయసొచ్చినట్టు, – ఎవరినో కోయని పిలిచినట్లు, – ఊగులుపోవంగా. –

ఆ ఊగున, – కోనవాగుకు వెల్లువొచ్చి...వెల్లువరెచ్చి వరదొచ్చి, – కాలూన తావులేక ఏకమయం కాగా, – జీవాలన్నీ, – మరో కోనకు ఈదులాడుకుపోగా, – కోనసిరి, – తాపుట్టి పెరిగిన కోనకు వెన్నిచ్చుకోలేక, – మానికి ఎగబ్రాకి, – చిటారుకుపోయి, – కెంపుకొడిపూవును, – గోటితో గీరి, – మానుఏకం – దీసి, – పదిలంగా చుట్టి, – అమ్ముకు లగించి, – ఆకాశంలోకి అంతరిక్షంలోకి విడువంగా...అలా దూసుకున్న పూవు, దారినిపట్టి... గాలిపొరమీద తేలుకుపోయి, – పుప్పొడి రగులంగా, – బరువెక్కి, భారమెక్కి, – తామరల మడుగులో, – మారాజు సీమలో, – సీమ ఏలేవాడి, గారాబాలకూన, – జలకాలాడంగా, – సరసను రాలె:

పూవుసోకిన మేర, – బుగబుగలాడి, – బుగబుగలాడిన మేర, ముదురుపచ్చదేరి, – వేయిన్నొక్కచుక్క, ఒక్క మొయిని మిడిసినట్లు, – చందమామ దూగర రేగినట్లు, – పాలవెల్లి నేలకూలినట్లు, వెలుగులు చిటపటలాడి, – రంగులు సుడికట్టి, – మడుగునీరు వడిపట్టి, – హంస కదిలినట్టాడంగా, –

రాలినపూవు, రంగు ముదిరి, రేకముదిరి, – పుప్పొడి పూసకట్టి, – పూస బుడగంతకెదిగి, – గాలిసోకిళ్ళ, చిటుకు చిటుకుమనంగా, – పుప్పొడిమంచు కమ్ముకోంగా, – రాచకూనకు, – మాయదారి మరులొచ్చె... మనసును రెక్కలొచ్చినట్టనిపించె, – వినని ఎలుగు వినిపించె, – చూడని చోద్యాలు కనిపించె–

ఇదేమా అనుకున్నది, – రాచకూన, – నిలువలేకపోయె, నిదురగాకపోయె, – వెనుదిరిగి చూడంగ చీకటే అయిపోయె, తానెవ్వరైనదీ తెలియకనెపోయె...కనుమలసి చూడంగ మునుముందు వెలుగాయె–తనకు అందినట్లనిపించె – తానందినట్లగుపించె,–

అలా నిలువలేకపోయిన రాచకూన, – తనకు తెలియక, పలుకులేక, – పట్టు తప్పిన తీవెలాగా, – తీంద్రం మానిన సింగం జూలులాగా, – తమ్మిని విడిచిన తుమ్మెద ఝుమలాగా, – చంద్రుడు సోకిన చెంగల్వలాగా, – సొమ్మసిల్లి సోలిపోయి, – అదేమా అని ఆదుకునేవారు ఎవరూలేని ఏకాంతమాయెనేమో, – మడుగున మల్లెలు కమ్మినట్టు, పైన జాజులు పయ్యెద సవరించినట్లు, – మందారాలు వల్లెవాటు వేసినట్లు, – పూపచిగురులు మేలిముసుగు నిమిరినట్లు, – కానరాని చేతులు, – తనకేమో ఆభరణాలిచ్చినట్లు, – అంగరాగ మలదినట్లు, – చిలిపిసేతలు చేసినట్లు, – లీలగా అనిపించగా, – బిడియం వసివాడించంగా, – తమకాలూ తబ్బిబ్బులుగా, – దొంతరవిడియ మందుకున్న మంకెన వాతెరతో, – కాముని చూడబోయే కన్నులతో మోమున నిండిన పున్నెముతో, – విన్నాణపు వేడుకతో, – వింతవేదనతో, – ఆణిముత్తెమంత మురిపెముతో, – చేర్చుక్కంత చెలువంతో, – నివ్వెరి మొనవాసి కలలో, – నిదురంత కాపురంచేసి, – మెలకువంత మగతా మమతా కుదురుకోంగా, – రాలిన పువ్వునందుకుని, – దాని సిగ్గులు నిమిరి, – కొనగోర కాటుకదీసి, – ఒక రేకను చికిలించి, – మరోరేక, – కెమ్మోవికద్ది, – అన్ని రేకలలా వెమ్మోమున హత్తించి, – రాలిన పూవును, రాజసంగా– పయ్యెద

కొత్తులిచ్చి – చేపట్టిన వాని చెక్కి_లి పుణికినట్లు, – వింత మనసుపోయి, – ఏమని పలికేనో –

గాలి పొరమీద తేలివచ్చి, – కానరాని వలపుతెచ్చి, – అలసిపోని ఆనందమిచ్చి, – కాంతుడు లేని కాపురమిచ్చి, – మిన్నంత కలలో కన్నతల్లినిచేసి, – బాలను ప్రోడను చేసినావు, యిది, – ఏ సీమ పట్లన వాని పంతమే! – తానందుక నన్నందుకుంటి ననుకున్నాడా, – నేలను నడిచేవాడు, నన్ను తేరిచూడరాదు., కొండకొమ్ము్మన ఉన్న వాడైతే, – నన్ను కోరుకోరాదు, – మానెక్కి_న వాడైతే, – తనకు మనసైనా, – మక్కు_వ తీయలేనని పలుకవే... గాలిని పడిపోఁ–

రాలిన పూవు, – వెల్లగొడుగై విచ్చుకోగా, – విచ్చుకున్న పూవు, – గువ్వలాగ పైన తేలగా, – తనకు తెలియక తానూ కదిలి – నీడను అడుగులు వేసి, – ఎదురయే చోద్యాలకు ఎడమోమై, – కంటికందిన, – వింతలకు పెడమోమై – సూటిమాపున – శూన్యంలో వెన్నెల కమ్మినంత మనసున, – అలాఅలా, – వాగులు దాటెనో ఏరులు దాటెనో, – గుట్టలు దాటెనో గుబ్బలి దాటెనో, – లెక్క_లేకపోయి, –

అలా, – అడుగు కదిలి పోతూండగా, –

తామర మడుగులో, రాచకూన తల పోసినప్పుడు, మానినున్న కోనసిరికి, – కొమరుతనం హెచ్చి, – కన్నెకలలో, కాంతుడైనప్పుడు, – మానుకూలి నేలపాదం పెట్టి – తానో తామర మడుగై, – కానరాని, తల్లితనానికి, – నూటొక్క_ హంస, – కూనలై, కనులబడగా, – సొమ్మసిల్లే ఆనందమొచ్చి, – హంసరెక్క_లు అలసటలు తీర్చగా, – ముసిముసి నవ్వు ముసలి తనానికి, ముదిరే వేళ, –

తానెక్కి_న మాని తావున, – కలయదిరిగిన కన్నెలేడి, కూనను విడిచిపోగా, – లేడికూనకు పుప్పొడి అద్ది, – తామర రేకులు తేనె దొన్నెలుచేసి, – వావిలి పూవులు మెదిపి, – ఆ ఉక్కెర మెక్కి_ంచి పెంపకం చేయగా, – కూనకు గుజ్జు సింగమంత, వెన్నొచ్చి, వేటొచ్చి, హంసలతో అన్నదమ్ముల పోలికను, – కోనసిరి కనుల నీడను గువ్వింతలాడుతూ ఉండగా, –

వెల్ల గొడుగు నీడ కదలివచ్చిన రాచకూన, – తాను ఆ తావుకు చేరుకోగా, – చూడని తల్లిని చూసిన సంబరాన, – హంసలు కమ్ముకోగా, – ఒక్క_ హంస గునగునపోయి, కోనసిరితో గుసగుసలాడంగా, – తక్కి_న హంసలు, బారుతీరి, బరాబరుల నడకలు నడిచి, – కోనసిరిని తల్లి కనులముందుకు తరలించుకురాగా, – లేడికూన సింగం నీటున విద్దెలు చూపించగా, – చోద్యాన ఉన్న రాచకూన, – కోనసిరిని చూసిందై, – కనులు అరమోడ్చిందై, – తలవంచుకున్న దాయెను, –

ఒక్క_ ఎగురున అందిన లేడికూనను, సందిట పట్టిన కోనసిరి మనసు యెన్నడూ లేని మరులోయింది,–

రాచకూన, ఆకసాన, వెలుగు పొంగినట్లు పొంగిపోయి, – వేయిన్నొక్క_ చుక్క_ తళుకాడినట్లు, కదిలిపోయె – అంతలో ముత్తెమంత మోముచేసుకొని, – కనులతో ఏమన్నదనగాను, –

కన్నెతనాన కలవచ్చింది, – మెలకువ లేకనే ఫలించింది, – వెలుగు రాపాడగా పుటక యెత్తినవాడు, – నన్నేలుకున్నాడు. నేలకు రాలినవాడు, – నా వయసు నిదురపాల్జేసినాడు...నీవు తెలియక చేసినతప్పు, – నిదురలో నాకు మెప్పయింది...కానరాకుండా కాపురం చేశాము, – కలలు హంసలై పుట్టినవి: నా బిడ్డలు నాకు చాలు; కోనంత కోరికుండి, – లేడికూననెత్తి పెంచి సింగాన్ని చేసినావు, – దానితో ఆట – ఆపైన నీ బ్రతుకు, – అని – తన దారిని తాను పోగా, – హంసలు అనుసరించిపోయె...

నాలుగు గిరులు కట్టి, – మడుగు చేసిన కోనలో కోనంత తామరల మడుగులో – ఆ హంసల పెంపకమాయె...

గిరుల కొమ్మలమీద చెంగలించే కూన పరుగందుకోలేక – కోనసిరి, – తాను పెరిగిన చిలికింత నీడనే తానో నీడగా నిలిచిపోయె...

★ ★ ★